క్లుప్తంగా

కౌన్సిల్ సాధారణ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలో పొందుపరిచిన పది అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి వార్డుకు రూ.10లక్షలు నిధులు కేటాయించామని తెలిపారు. ఈ నిధులతో ఆయా వార్డుల పరిధిలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో పేదలపై భారం మోపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్‌మీటర్ల వలన విద్యుత్ బిల్లుల్లో తేడాలు వస్తున్నాయని పేర్కొన్నారు. స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, వెంకమరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

1న ఆటో కార్మిక సంఘ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న రాజా

తోటపల్లిగూడూరు: జూలై 1వ తేదీన బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే ఆటో కార్మిక సంఘ ఆరో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా పిలుపునిచ్చారు. నరుకూరులోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి సరిగా లేదన్నారు. ర్యాపిడో, ఓలా వంటి ఆన్‌లైన్ రవాణా సంస్థల వల్ల అనేక మంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడుతున్నారన్నారు. ఇప్పటికే బాడుగలు సక్రమంగా లేక సతమతమవుతున్న ఆటో కార్మికులపై వివిధ రకాల ట్యాక్స్‌లు విధిస్తూ మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అందుకే రవాణారంగ రక్షణ కోసం, డ్రైవర్ల సంక్షేమ బోర్డు సాధన కోసం జూలై 9న సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బుచ్చిరెడ్డిపాళెంలో ఆటో కార్మిక సంఘం ఆరో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ఆటో కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు నాశిన పరంధామయ్య, గోపి, శివ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ వసుమతి

మనుబోలు: పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌డీఓ వసుమతి సూచించారు. మనుబోలు పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో రాజీ పడవద్దన్నారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త పోగుకాకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇళ్లలో పోగయ్యే చెత్తను వీధుల్లో పారబోయకుండా గ్రీన్‌అంబాసిడర్లకు అందజేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ జలజాక్షి, సచివాలయ సిబ్బంది నబియా, కరిష్మా వున్నారు.

శ్రీవారికి పల్లకిసేవ

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి పల్లకిసేవను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. శ్రీవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ధర్మరాజస్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చప్పరోత్సవం, అక్షరాభ్యాసం, విలువిద్య ఘట్టాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో జరిపారు. భగవద్గీత పఠనం, మహాభారత పురాణ కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా గాలి సుబ్బారావు దంపతులు, పెద్దినేని ప్రసాద్ నాయుడు, భారతి, రమేష్‌నాయుడు, సుజాత దంపతులు వ్యవహరించారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా చప్పరోత్సవం, లక్షాగృహ దహనం తదితర కార్యక్రమాలను ఆదివారం నిర్వహించనున్నామని ఈఓ జానకి తెలిపారు.

అర్బన్ బ్యాంక్ మహాజన సభ



హాజరైన ఖాతాదారులు



మాట్లాడుతున్న నాగేంద్రసాయి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ షేర్ హోల్డర్లకు.. వచ్చిన లాభాల్లో 12 శాతం డివిడెండ్‌ను ఇస్తున్నామని బ్యాంక్ చైర్మన్, ఏపీ ఫెడరేషన్ చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి పేర్కొన్నారు. నగరంలోని టౌన్ హాల్లో బ్యాంక్ మహాజన సభను శనివారం నిర్వహించారు. సహకార పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగర, రూరల్ ప్రాంతాల్లో నూతనంగా బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే అవకాశం లభించిందని వివరించారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్‌కు వచ్చిన నికర ఆదాయం రూ.79,52,456లో షేర్ హోల్డర్లకు డివిడెండ్ రూపంలో రూ.27,55,511ను అందజేయనున్నామని చెప్పారు. సూపర్ సీనియర్ సిటిజన్లకు 9.5 శాతం వడ్డీని ఇస్తున్నామని వెల్లడించారు. రుణాలకు సంబంధించిన వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించిన ఖాతాదారులను సత్కరించారు. బ్యాంక్ వైస్ చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్లు వినోదిని, మహేశ్వరి, జయకోటేశ్వరరావు, ప్రభాకర్ రెడ్డి, అమర్‌ఖాసిం, నాగలక్ష్మి, శ్రీనివాసమూర్తి, లతీఫ్ అహ్మద్, వెంకటేశ్వరరావు, జీవన్ శేఖర్‌రెడ్డి, సీఈఓ అనిత తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు సిటీ: పాతవెల్లంటిలో రూ.3.11 కోట్లతో చేపట్టిన సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గొల్లకందుకూరు, సజ్జాపురం, కందమూరు, కొత్తవెల్లంటి, పాతవెల్లంటి ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయనున్నామని వివరించారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ ఎక్స్‌పో ప్రారంభం



నెల్లూరు(బృందావనం): అమ్మ ఫర్నిచర్ మాల్ ఆధ్వర్యంలో మినీబైపాస్‌లోని జీపీఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఫర్నిచర్ ఎక్స్‌పోను సంస్థ వ్యవస్థాపకుడు గడ్డం సుధాకర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు గడ్డం సుజన్‌రెడ్డి మాట్లాడారు. ఎక్స్‌పోలో అన్ని రకాల అధునాతన ఫర్నిచర్‌పై 50 శాతం వరకు రాయితీని ఇవ్వనున్నామని వివరించారు. జూలై రెండు వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ఏర్పాటు



నెల్లూరు(బృందావనం): ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛంద సేవా సంస్థగా ప్రజలకు సేవ చేయాలనేదే రోటరీ క్లబ్ లక్ష్యమని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ కేశవరెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి రోటరీ క్లబ్ ఆడిటోరియంలో క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని శనివారం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసపత్రాలను అందజేశారు. ఆర్టీసీ బెస్ట్ డ్రైవర్‌గా కృష్ణయ్యకు ప్రోత్సాహక బహుమతిని ప్రదానం చేశారు. రోటరీ క్లబ్, నెల్లూరు అధ్యక్ష, కార్యదర్శులు బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, అఖిలేష్‌రెడ్డి, శ్వేతారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, రోటరీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

- నెల్లూరు జిల్లా రోటరీ క్లబ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటిపర్తి ఉదయభాస్కర్‌రావు, కార్యదర్శిగా కొండపల్లి రవీంద్రనాథ్ ఎన్నికయ్యారు. రోటరీ సింహపురి కోస్టల్ జోన్ సభ్యులు రాఘవేంద్రశెట్టి, శరత్‌కుమార్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ పవర్డ్ వీఎల్ఎస్ఐ డిజైన్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐఐటీ, తిరుపతి అసోసియేట్ ప్రొఫెసర్ విక్రమ్‌కుమార్ హాజరయ్యారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్, ఈసీఈ విభాగాధిపతి మురళి, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ హజరత్తయ్య, ప్రోగ్రామ్ సమన్వయకర్త సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

ఆత్మీయ సమావేశం

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశాన్ని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శనివారం నిర్వహించారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ, పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి, నేత మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు నగరాధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగ జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందజేశారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంప్యూటర్ ఆపరేటర్లపై చర్యలు చేపట్టరూ..

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించిన అర్జీలను ఆన్‌లైన్ చేసే ఆపరేటర్లపై చర్యలు చేపట్టాలని పలువురు దళిత, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు శనివారం ఫిర్యాదు చేసిన అనంతరం వారు మాట్లాడారు. హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అర్జీని ఆన్‌లైన్ చేయించేందుకు వెళ్లగా, కొందరు ఆపరేటర్లు, సహాయక సిబ్బంది ఫిర్యాదును ముందుగానే ఫోటో తీసి బయట వ్యక్తులకు పంపిన అంశాన్ని గుర్తించామని చెప్పారు. వీరిపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రఘు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత శ్రీకాంత్ కుమారుడ్ని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచించారు.

శంకరమఠంలో నాలుగు నుంచి హోమాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలో గల కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో కామ్య హోమ సప్తాహ మహోత్సవాన్ని జూలై 4 నుంచి పది వరకు నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 96528 60264, 99499 18358 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు సిటీ: భర్త అదృశ్యంపై వేదాయపాళెం పోలీసులకు బాధితురాలు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. విజయలక్ష్మినగర్‌లోని ఐదో వీధిలో నివాసం ఉంటున్న జయశేఖర్, గాయత్రి దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. నారాయణ హాస్పిటల్లో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఆయన.. ఇన్సురెన్స్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఆమె పనిస్తున్నారు. భార్యపై అనుమానంతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి.. కోపం తగ్గాక తిరిగొచ్చేవారు. తాజాగా ఈ నెల 20న మరోసారి గొడవ జరగ్గా, ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరాతీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ జెన్‌కో శ్రీశైలం ప్రాజెక్టు వద్ద ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీలను ట్రాన్స్‌కో ఉత్తర్వుల మేరకు జూలై ఎనిమిదిన నిర్వహించనున్నారని ఎస్పీడీసీఎల్ జిల్లా స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామి వేలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ – 2లు అర్హులని చెప్పారు. అర్హత, ఆసక్తి గల వారు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం ఉదయం ఎనిమిదికి నిర్వహించనున్న సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరుకావాలని, వివరాలకు 90308 02038, 85550 26614 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయశాఖ ఉద్యోగులు



నెల్లూరు (లీగల్): ఏపీ హైకోర్టు జడ్జి, నెల్లూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ శ్రీనివాసులురెడ్డిని నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. పలు అంశాలపై వినతి పత్రాన్ని అందజేశారు. అధ్యక్షుడు సురేష్‌బాబు, జనరల్ సెక్రటరీ నారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కోశాధికారి సునీల్‌కుమార్, సంఘ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శివకుమార్, నేతలు సుమన్, వేణుగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

⇨ ఏపీ హైకోర్టు జడ్జి, నెల్లూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీనివాసులురెడ్డిని నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన ఐక్యవేదిక అభ్యర్థులు, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్‌కు సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, కోశాధికారి పెంచల ప్రణీత్, లైబ్రరీ సెక్రటరీ నాగ శ్రీనివాస్, ఈసీ మెంబర్లు జితేంద్ర, శ్రీధర్, మమత, నేతలు కుడుముల రవికుమార్, భానురామణ్, శంకరయ్య, కేవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నేత విక్రమ నరసింహ కోరారు. వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వసతులను డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళ కొందరు ప్రవేశించి మద్యం సేవిస్తున్నారని ఆరోపించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. యశ్వంత్, శేఖర్, రాజేష్, సురేంద్ర, సునీల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల మేరకే లేఅవుట్ల ఏర్పాటు



సూచనలిస్తున్న నందన్

నెల్లూరు సిటీ: నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అనుమతుల మేరకే లేఅవుట్లను ఏర్పాటు చేయడంతో పాటు టౌన్ ప్లానింగ్ విభాగ సూచనలకు అనుగుణంగా భవనాలను నిర్మించాలని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. 17వ డివిజన్లోని గుండ్లపాళెంలో లేఅవుట్‌ను శనివారం సందర్శించారు. లేఅవుట్‌కు సంబంధించిన అన్ని అనుమతి పత్రాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అనధికార కట్టడాలు, అనుమతులను ఉల్లంఘించిన భవనాలకు నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం అపోలో హాస్పిటల్ రోడ్డు సమీపంలోని పార్కును సందర్శించారు.

⇨ జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సిటీ ప్లానర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

⇨ వీఆర్ మున్సిపల్ పాఠశాల వ్యవస్థీకృత విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సును కమిషనర్ నందన్ నిర్వహించారు. వీఆర్ మున్సిపల్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాంగణంలో ఖాళీగా ఉన్న తరగతి గదులను ఆధునికీకరించి పాఠశాలకు అనుసంధానించేలా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

పీడీఎస్‌యూ నగర కమిటీ సమావేశం



మాట్లాడుతున్న సాగర్

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాగర్ ఆరోపించారు. నగరంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన పీడీఎస్‌యూ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను మూసేస్తున్నారని ఆరోపించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన మంత్రి లోకేశ్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారూఖ్, నగరాధ్యక్షుడు ఆశిర్, జిల్లా కమిటీ సభ్యులు అన్వర్, మస్తాన్, నవీన్, సుబ్బు, హర్ష, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రమణారెడ్డి సేవలు ఎనలేనివి



సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): ఆరోగ్య శాఖలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్‌గా ఏనుగు రమణారెడ్డి ఎనలేని సేవలను అందించారని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందనున్న ఆయన్ను సంతపేటలో శనివారం సత్కరించిన అనంతరం సుధాకర్‌రావు మాట్లాడారు. రాష్ట్ర స్థాయి నేతగా రమణారెడ్డి ఎదగడాన్ని అభినందించారు. ఆయన శేష జీవితం హాయిగా సాగాలని కాంక్షించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో హంస ఆఫీస్ బేరర్లకు ప్రాధాన్యం కల్పించిన డీఎంహెచ్ఓ సుజాత, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలను సుధాకర్‌రావు తెలియజేశారు. హంస జిల్లా సెక్రటరీ కమల్‌కిరణ్, గౌరవాధ్యక్షురాలు ఇందిర, నేతలు మజరుల్లా, ఏటూరి జయశ్రీ, గౌస్‌బాషా, ఖాదర్‌మస్తాన్, పరిమళ, అరవ కుమారి, వైద్య, ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కల్పం శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధికి గణాంక వివరాలు తప్పనిసరి

నెల్లూరు(అర్బన్): దేశంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందేందుకు గణాంక వివరాలు తప్పనిసరని ప్రభుత్వోద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి, గణాంక నిపుణుడు రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర – 2047 ప్రణాళిక రచనలో రాష్ట్ర ప్రభుత్వానికి గణాంకాలను అందిస్తూ కీలకపాత్ర పోషిస్తున్న తమ శాఖ ఉద్యోగులకు అభినందనలను తెలియజేశారు. ఐటీకి అనుబంధంగా గణాంక శాస్త్రాన్నీ విద్యార్థులు అభ్యసించి సమాజ పురోగమనంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని మహాత్మాగాంధీ సబ్‌స్టేషన్ పరిధిలో తీగల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీకేడబ్ల్యూ కళాశాల, నీలగిరి సంఘం, బట్వాడిపాళెం సర్కిల్, ప్రశాంతినగర్, అంబేడ్కర్ నగర్, కేవీఆర్ పెట్రోల్ బంక్, బ్రహ్మానందపురం, బారాషహీద్ దర్గా, కలెక్టర్ బంగ్లా, కార్పొరేషన్ కార్యాలయం, బషీర్‌నగర్, లేక్‌వ్యూకాలనీ, సుజాతమ్మకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.